www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 13 జనవరి 2023
5
వైఎస్ఆర్



విమానాశ్రయంలో భద్రత మరింత కట్టుదిట్టం : డిఐజి

కడప అర్బన్ : కడప విమానాశ్రయంలో భద్రత మరింత కట్టుదిట్టం చేయాలని డిఐజి వెంకట్రామిరెడ్డి ఆదేశించారు. గురువారం కడప విమానాశ్రయంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన అంశాలపై ఎస్.పి అన్బురాజన్‌తో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ విమానాశ్రయ ఆవరణలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని, అక్రమంగా ఎవరూ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రహరీ చుట్టూ వాచ్ టవర్లు ఏర్పాటు, రాత్రి పూట లైటింగ్ ఏర్పాటు చేసి నిరంతరం గస్తీ నిర్వహించాలని చెప్పారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. విమానాశ్రయ భద్రతకు ఫైర్, రెవెన్యూ, ఎస్.పి.ఎఫ్, జిల్లా పోలీసు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప డిఎస్పీ బి.వెంకట శివారెడ్డి, చెన్నూరు ఎస్.ఐ శ్రీనివాసులు రెడ్డి, వల్లూరు ఎస్.ఐ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

'కొప్పర్తి'కి పైప్‌లైన్

రూ.150 కోట్లతో డిపిఆర్ సిద్ధం
బ్రహ్మసాగర్ నుంచి సరఫరాకు యత్నం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



కొప్పర్తి పారిశ్రామికవాడకు నీటి సరఫరా పైప్‌లైన్ పనులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ప్రభుత్వం రూ.150 కోట్లతో కూడిన పనులకు ఆమోదం తెలిపింది. తాత్కాలిక పైప్‌లైన్ నిర్మాణ పనుల కారణంగా కీ.శే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలోని రూ.450 కోట్లతో అనంతపురం సైన్స్‌సిటీ, బ్రహ్మణీ ఉక్కు పరిశ్రమ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపకల్పన చేసిన సోమశిల బ్యాక్‌వాటర్ సరఫరా పైప్‌లైన్ మూలన పడింది. ఇటీవలి కాలంలో కొప్పర్తి పారిశ్రామికవాడకు పరిశ్రమల తాకిడి పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం నీటి సరఫరా కల్పనపై దృష్టి సారించింది. ప్రస్తుత ప్రతిపాదిత 33 కిలోమీటర్ల మేర 800 మిల్లీమీటర్ల డయామీటర్ల వ్యాసార్థం కలగిన పైప్‌లైన్‌ల ద్వారా 480 మిలియన్ లీటర్ ఫర్ డే (ఎంఎల్‌డి) నీటిని సరఫరా నిమిత్తం రూపకల్పన చేశారు. 1460 ఎంఎల్‌డి సామర్థ్యం కలిగిన సమ్మర్ స్టోరేజీ సంప్ నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలుస్తోంది. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్రహ్మసాగర్ రిజర్వాయర్ నుంచి ఆర్‌టిపిపికి పైప్ లైన్‌లతో నీటిని సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. ఆర్టీపీపీతో అవగాహన కుదుర్చుకుని తాత్కాలిక ప్రాతిపదికన నీటి సరఫరా పైప్‌లైన్ ఉపయోగించుకోనున్నారు. రూ.150 కోట్ల డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు పరిశీలన అనంతరం టెండర్ పిలిచి శాశ్వత ప్రాతిదిపకన పూర్తిస్థాయి పైప్ లైన్ నిర్మాణ పనులను చేపట్టనున్నారు. మైదుకూరు-చాపాడు మధ్య నుంచి వెళ్తున్న ఆర్‌టిపిపి పైప్‌లైన్ దగ్గర నుంచి 33 కిలోమీటర్ల మేర తాత్కాలిక పైప్‌లైన్ నిర్మాణ పనులకు రూపకల్పన చేశారు. తాత్కాలిక పైప్‌లైన్ కడప-మైదుకూరు జాతీయ రహదారి వెంబడి కొప్పర్తి పారిశ్రామికవాడకు నీటిని సరఫరా చేయనున్నారు. ఆర్టెక్ట కింద నుంచి కొప్పర్తి పారిశ్రామికవాడలో ఏర్పాటైన పరిశ్రమల నీటి అవసరాలకు సబ్ మెర్సిబుల్ బోర్లపై ఆధారపడిన సంగతి తెలిసిందే. కొప్పర్తి పారిశ్రామికవాడకు పెరుగుతున్న పరిశ్రమల నేపథ్యంలో పారిశ్రామిక అవసరాలకు తగిన మేర నీటి సమస్యను పరిష్కారానికి కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. కొప్పర్తి పైప్‌లైన్ పనులకు సంబంధించిన ఆమోదం తెలిపింది. మార్చి నుంచి కొప్పర్తి పైప్‌లైన్ పనులు చేపట్టడానికి అనుమతి లభించింది. ఈ పనులు పూర్తిస్థాయిలో నీటి సదుపాయం అందుబాటులోకి వస్తే పారిశ్రామికీకరణ మరింత ఊపందుకునే అవకాశాలు పుష్కలముగా ఉన్నాయనడంలో సందేహం లేదు.

పైప్‌లైన్ పనులకు శ్రీకారం

కొప్పర్తి పారిశ్రామికవాడకు నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటుకు ఆమోదం లభించింది. మార్చి నాటికి పనుల్ని గ్రౌండింగ్ చేస్తాం. ఆర్నెళ్ల నుంచి రెండేళ్లలోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

- శ్రీనివాసమూర్తి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్, కడప.

ఘోర రోడ్డు ప్రమాదం

- టిప్పర్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు
- ఇద్దరు కూలీలు, డ్రైవర్ దుర్మరణం
- అన్నం తింటుండగా ఘటన
- చెల్లాచెదురైన మృతుల శరీరభాగాలు
- రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని నిరసన



ప్రమాదంలో మృతిచెందిన డ్రైవర్, కూలీ



మృతదేహాన్ని వెలికి తీస్తున్న పోలీసులు, స్థానికులు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పట్టణం నుంచి ప్రొద్దుటూరు వెళ్లేదారిలో ధర్మాపురం గ్రామం వద్ద గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. అర్బన్ సిఐ సదా శివయ్య కథనం మేరకు.. ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగు వైపునకు పది టైర్ల టిప్పర్ బయలు దేరింది. ధర్మాపురం గ్రామ వద్దకు రాగానే వాహనం అతివేగంగా రోడ్డు పక్కన అన్నం తింటున్న ఇద్దరి పైకి దూసుకెళ్లింది. సంఘటనలో వారు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వారి శరీర భాగాలు తునాతునకలయ్యాయి. టిప్పర్ వారిపై నుంచి వెళ్లి పక్కనున్న పొలాల్లోకి పల్టీలు కొట్టి దూసుకెళ్లింది. ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ కూడా అక్కడికక్కడే మృతిచెందాడు. అతివేగంగా ట్రిప్పర్ రావడం వల్ల ముగ్గురు సంఘటనా స్థలంలో ఘోరంగా మరణించారు. మృతుల్లో గొరిగనూరుకు చెందిన ఓబులేసు (54), ధర్మపురం గ్రామానికి చెందిన యనమల నాగ సుబ్బారెడ్డి (63), ఉప్పలపాడుకు చెందిన డ్రైవర్ విజయ్‌కుమార్ ఉన్నారు. రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాల శరీర భాగాలను చూసి స్థానికులు విస్మయానికి గురయ్యారు. విషయం తెలిసిన వెంటనే జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వంను కొరతామన్నారు. అలాగే రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకొని బాధితుల కుటుంబాలను పరామర్శించి న్యాయం చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. ఓబులేసు, నాగసుబ్బారెడ్డి కూలీ పనికి వచ్చి రోడ్డు పక్కన ట్రాక్టర్ వద్ద అన్నం తింటున్న వారిపై టిప్పర్ వేగంగా దూసుకొచ్చి ఢీకొంది. కాగా డ్రైవర్ విజయ్ కుమార్‌కు ఫిట్స్ రావడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొంటున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంతో ఉప్పలపాడు, గొరిగనూరు, ధర్మవరం గ్రామాల్లో విషాద చాయలు అలముకున్నాయి.

రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని నిరసన

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఒకొక్కరికి రూ.10 లక్షల చొప్పున పరిహారం చెలించాలని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రహదారిపై సుమారు మూడు కిలో మీటర్ల మేర రాకపోకలు నిలిచిపోయాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి పరిహారం చెలించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ సుధీర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబాలకు కచ్చితంగా పరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళనను విరమించారు.

బుగ్గవంక బ్రిడ్జిలు వెంటనే నిర్మించాలి

కడప అర్బన్ : నగరంలోని షహమీరియా మసీదు వద్ద ఉన్న మురా దియా నగర్ గుర్రాల గడ్డకు అనుసంధానంగా ఉన్న బ్రిడ్జి తో పాటు, బాదుల్లా సాహెబ్ మకాన్ వద్ద ఉన్న నాగరాజు పేట రవీంద్ర నగర్‌కు అనుసంధానంగా ఉన్న మరో బ్రిడ్జిని వెంటనే ప్రభుత్వం నిర్మించాలని రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. కడప ప్రెస్ క్లబ్ లో గురువారం బ్రిడ్జిల నిర్మాణం పై రాజకీయ పార్టీల నాయకులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీఖాన్, మైనారిటీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిడ్జిలను వెంటనే నిర్మించకపోగా నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. మురారి నగర్, గుర్రాలగడ్డ బ్రిడ్జికి 300 సంవత్సరాల చరిత్ర ఉందని తెలిపారు. బ్రిడ్జి ద్వారా ఎంతోమంది ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారన్నారు. ఇటీవల ప్రభుత్వం బుగ్గ వంక పరివాహక ప్రాంతం ఆధునీకరణ పేరుతో కేవలం రక్షణ గోడలు మాత్రమే నిర్మించిందని, బ్రిడ్జిని పూర్తిగా తొలగించి కొత్త బ్రిడ్జిని నిర్మించకపోగా ప్రజల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తూ రక్షణ గోడలు నిర్మించారని చెప్పారు. సమావేశంలో సిపిఎం నాయకులు బి.నారాయణ, రామ మోహన్, సిపిఐ నేత వెంకట శివ, ఎన్ఆర్‌సి జేఏసీ జిల్లా కన్వీనర్ బాబు భాయ్, జనసేన నేత గౌస్ బాషా, ఆమ్ ఆద్మీ పార్టీ నేత శ్రీనివాసులు, లోక్‌సత్తా నాయకుడు కృష్ణయ్య, తెలుగుదేశం పార్టీ నేతలు వి. ఎస్. అమీర్ బాబు, హరి ప్రసాద్, బీఎస్పీ నేత గుర్రప్ప, స్థానిక బాధిత ప్రజలు ప్రతినిధి హమీద్, ముస్లిం పోరాట సమితి నాయకుడు రఫీ, బీఎస్పీ నేత గుర్రప్ప , హేతువాదుల సంఘం సి. ఆర్. వి. ప్రసాద్, తెలుగుదేశం విద్యార్థి నాయకుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

క్రీడా రంగానికి పెద్దపీట

కడప : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో క్రీడా రంగానికి పెద్ద పీట వేశారని జరుగుతోంద ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్ బి అంజాద్‌బాష అన్నారు. గురువారం స్థానిక డిఎస్ఎ మైదానంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ధ్యాన్‌చంద్ అకాడమీ డైరెక్టర్ సుభాన్‌బాష సహకారంతో హాకీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. హాకీ పోటీలలో గెలుపొందిన వారికి, రన్నర్స్‌గా నిలిచిన వారిక జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో స్టెప్ సిఇఒ, తోట కృష్ణ, టోర్నమెంట్ ఆన్‌ఛార్జులు కర్నూల్, అనంతపురం, నెల్లూరు, మదనపల్లి, రాయచోటి, కడప, తిరుపతి, కొండపేట జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆలయం కూలిస్తే ఊరుకోం

ప్రజాశక్తి - కడప అర్బన్

మాసాపేట మున్సిపల్ క్వార్టర్స్‌లో ఉన్న సీతారాముల ఆలయాన్ని కూల్చివేస్తే చూస్తూ ఊరుకోమని ఆలయ గౌరవాధ్యక్షులు సి. శంకర్, స్థానికులు శివ, వాసు నవ కాంత్ హెచ్చరించారు. గురువారం ఆలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మసాపేట మున్సిపల్ కోటర్స్ ఆలయం నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కల్గిన ఆలయం ఉందని చెప్పారు. ఇలాంటి ఆలయాన్ని ప్రభుత్వ అధికారులు కూల్చడానికి ప్రయత్నించడం దుర్మార్గమని చెప్పారు. కార్యక్రమంలో గోశాల నవకాంత్,రాముడు, నరసింహులు,కుమార్, సాయి పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న స్థానికులు

నేటి నుంచి శిల్పారామంలో సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

శిల్పారామంలో ఈనెల 13 నుంచి 16 వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు పరిపాలన అధికారి పి. శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ సాయంత్రం ఐదు నుంచి 8:30 వరకు భరతనాట్యం, కూచిపూడి, సినీ గీతాలు, జానపద నృత్య ప్రదర్శనలు గంగిరెద్దులు హరిదాసులు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13న ముగ్గుల పోటీలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 15న గాలిపటాల పోటీ మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు వరకు ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'అన్నమాచార్య' కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యతోపాటు, క్యాంపస్ ప్లేస్మెంట్ నిర్వహించడంలో విద్యా సంస్థల అధినేత చొప్ప గంగిరెడ్డి ముందుంటారని ఆయన తెలియజేశారు. విద్యార్థులు పట్టుదలతో చదువుతూ తల్లితండ్రుల ఆశలను తమ ఆశయాలను చేరుకొని పాటుపడాలన్నారు, ముఖ్యంగా తమ కళాశాలలో ర్యాగింగ్ అనేది ఉండదని ఆయన తెలియజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, ప్లేస్‌మెంట్ అవకాశాన్ని కూడా కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎస్ విభాగాధిపతి శశి కుమార్, మురళీకృష్ణ, అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

నేచురల్ గ్యాస్ స్టేషన్ ప్రారంభం

కడప అర్బన్ : భారతీయ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సిజిడి) పరిశ్రమలో అగ్రగామి సంస్థలలో ఒకటైన ఏజీ అండ్ పీ ప్రథమ్, ఆంధ్రప్రదేశ్‌లో మొట మొదటి లిక్విఫైడ్ కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ స్టేషన్‌ను నగరంలోని ఏపీఐఐసీ పారిశ్రామిక పార్క్ వద్ద ఏర్పాటు చేశారు. గురువారం ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, కడప ఎంపి వై ఎస్ అవినాష్ రెడ్డి, ఏజీ అండ్ పీ ప్రథమ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అభిలేష్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సంప్రదాయం ఇంధన వనరులు పెట్రోల్, డీజిల్‌తో పోలిస్తే సిఎన్‌జిలో ప్రయోజనాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణహితమైన వాతావరణాన్ని సృష్టించడానికి వీలవుతుందన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ 'పర్యావరణ అనుకూలం కావడంతో పాటుగా ఎలాంటి హానికరమైన ఉద్గారాలను విడుదల చేయని కారణంగా సహజ వాయువును హరిత ఇంధనంగా భావిస్తుంటారని పేర్కొన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ సిఇఒ అభిలేష్ గుప్తా మాట్లాడుతూ మొట్ట మొదటి ఎల్‌సిఎన్‌జీ స్టేషన్ ప్రారంభించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అత్యం త సహజసిద్ధమైన వాయువును ప్రత్యామ్నాయ ఇంధనంగా గృహాలు, పరిశ్రమలు, వాణిజ్య, రవాణా విభాగాలలో స్వీకరించగలదనే నిబద్ధతను చాటి చెబుతున్నామన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

కడప : విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యుత్ శాఖ ఉన్న తాధికారి ఎస్. ముని శంకరయ్య అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి వినియో గదారుల సమస్యల పరిష్కార నిమిత్తం 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ' కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ రకాల సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ప్రధానంగా కడప కొండాపురం చింతకొమ్మదిన్నె ప్రాంతాల నుంచి వ్యవసాయనికి సంబంధించి, విద్యుత్తు లైన్లకు సంబంధించి సమస్యలు తెలియజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. సుబ్రహ్మణ్యం, జూనియర్ ఇంజనీర్ జి. లావణ్య పాల్గొన్నారు.



ఫోన్ ద్వారా సమస్యలు వింటున్న ఎస్ఇ

వైసిపి పాలనలో పండుగలు కరువు : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్



మాట్లాడుతున్న టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య

వై సి పి పాలనలో ప్రజలు పండుగలు నిర్వహించుకోలేని స్థితిలో ఉన్నారని టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, లింగాల శివశంకర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జగన్ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాల పేరిట అధిక ధరలతో సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని వాపోయారు. చంద్రబాబు హయాంలో చంద్రన్న క్రిస్మస్ కానుక,రంజాన్ తోఫా, సంక్రాంతి కానుక ఇచ్చేవారని పేద ప్రజలందరూ సంతోషంగా పండుగలు చేసుకొనే వారని గుర్తు చేశారు. జగన్ పాలనలో పండుగల సందడి లేదన్నారు. ప్రజలు టిడిపి పాలనను కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బిసిసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి, సిటీ మైనార్టీ అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్ కడప వాణిజ్య విభాగం నెల్లూరు శ్రీధర్, మజ్జారి శ్రీనివాసులు, అబ్దుల్లా పాల్గొన్నారు.

హామీల అమలు కోసం బస్సు యాత్ర

కడప అర్బన్ : రాష్ట్ర విభజన నేపథ్యంలో పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీల సాధన కోసం యువజన, విద్యార్థి, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కమిటీల నేతృత్వంలో ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 4 వరకు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహించే బస్సు యాత్రను విజయంతం చేయాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు పిలుపునిచ్చారు. గురువారం డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లయినప్పటికీ విభజన చట్టంలో పేర్కొన్న నిధులు, ప్యాకేజీలు, ఉన్నత విద్యా సంస్థలు, కడప ఉక్కు పరిశ్రమ, ప్రాజెక్టులు కల్పించలేదని పేర్కొన్నారు. బస్సు యాత్రలో యువకులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, నాయకులు ఉదయ్, శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా తమ సచివాలయంలో పనిచేస్తున్న 33 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు చేశామని చెప్పారు. కార్మికులు సంతోషంగా పండుగ నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో దుస్తులు అందజేశామన్నారు. దుస్తులు పంపిణీ చేసినందుకు సర్పంచ్ పారిశుధ్య కార్మికులు ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రక్రియను వాయిదా వేయాలి : యుటిఎఫ్

కడప అర్బన్ : పాఠశాల విద్య కమిషనర్, పాఠశాల విద్య ప్రిన్సిపల్ కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులు భిన్నంగా ఉన్నాయని, దీని వల్ల గందరగోళం ఏర్పడుతోందని, వెంటనే పని సర్దుబాటు ప్రక్రియను వాయిదా వేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం ఉద్యోగోన్నతులకు విల్లింగ్ తెలిపిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను తాత్కాలిక పద్ధతిలో సర్దుబాటు చేస్తూ కౌన్సిలింగ్ జరపడాన్ని వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్స్ కోర్టు పరిధిలో ఉన్నందున తాత్కాలిక నియామకాలు చేపడతామని, ప్రమోషన్స్ వారికి రూ.2500 ఇస్తామని కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. జనవరి 20 నుంచి ఇలా వర్క్ అడ్జస్ట్మెంట్ చేసిన వారికి నూతన ప్రదేశంలోనే జీతం ఇస్తామని ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారని, దీనివల్ల ఉపాధ్యాయులు గందరగోళానికి గురి అవుతున్నారని తెలిపారు. సీనియార్టీ, ప్లేస్ల డిస్ ప్లేలపై కూడా స్పష్టత లేదని పేర్కొన్నారు. తాత్కాలికంగా వాయిదా వేసి సంక్రాంతి సెలవులు అనంతరం సంఘాలతో చర్చించాలని, అనంతరం కౌన్సిలింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వై.మస్తానయ్య, నాయకులు డి.క్రిష్ణారెడ్డి, రమణమూర్తి, శ్రీహరి, అస్లాం బాషా పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

కడప అర్బన్ : హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న నారాయణ స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనం గా నిర్వహించారు ప్రిన్సిపల్ గీత ఆధ్వ ర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఏజీఎం చెన్నకేశవరాజు, ఆర్ఐ కిరణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బోగి మంట వేసి, విద్యార్థులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పిల్లలు సాంస్కృతి నృత్యాలతో, సంప్రదాయ వస్త్రధారణతో ఎంతగానో అలరించారు. అనంతరం గాలిపటాలను ఎగరేసి కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



విద్యార్థులకు రేగిపళ్ళు వేస్తున్న ప్రిన్సిపల్‌గీత

హామీ మరువడం అన్యాయం : ఎమ్మెల్సీ

కడప అర్బన్ :పిఆర్‌సి ఉద్యమ సమయంలో సంఘాలతో చర్చించి 35వేల మంది టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పిస్తామని, మూడు నుంచి పది తరగతుల పిల్లలందరికీ సబ్జక్టు టీచర్లతోనే బోధన చేయిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మరిచిందని అన్యాయమని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం వివిఆర్ ఎస్టీయు భవన్ లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీన ప్రక్రియ పేరుతో ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఎటువంటి ఉద్యోగోన్నతులు, కవలం సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులతోనే పనిచేయిస్తూ,కాలం వెళ్లబుచ్చడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మల్లు రఘునాథరెడ్డి, సుబ్రమణ్యంరాజు, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి ,చెన్నకేశవరెడ్డి, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉండాలి

కడప అర్బన్ : అధికారులు పేదలకు అండగా ఉండాలని టిడిపి నగర అధ్యక్షులు సానపు రెడ్డి శివ కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి జయకుమార్ కోరారు. గురువారం కార్పోరేషన్ మేనేజర్ ఇనాయతుల్లాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని 17వ డివిజన్ ముసల్ రెడ్డి పల్లె గ్రామం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అక్కడి ప్రజలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. విస్తరణ పేరుతో సరైన కొలతలు లేకుండా, రోడ్డు పాయింట్ ఫిక్స్ చేయకుండా చిన్న చిన్న వ్యాపారస్తులను భయబ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. మార్కింగ్ విషయంలో కార్పొరేషన్ సర్వేయర్ తో పాటు జిల్లా సర్వేయర్ ను ఏర్పాటు చేసి ప్రజలందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో టిడిపి వార్డు ఇన్‌ఛార్జి మునీంద్ర యాదవ్, నాయకులు గంగాధర్, మేకల వెంకటేష్ సుబ్బరాయుడు యాదవ్ పాల్గొన్నారు.

రక్తపరీక్షలపై అవగాహన

కలసపాడు : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలపై, పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని డాక్టర్, కె. సాయి తేజ తెలిపారు. గురువారం స్థానిక పిహెచ్‌సిలో ఎఎన్ఎంఇ, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెప్రసీ వివిధ రకాల వ్యాధులపై మండలంలో సర్వే చేసి ఎప్పటికప్పుడూ నివేదికలను సిద్ధపాటు చేసుకోవాలని అన్నారు. ఇఎంసి, ఎఎన్సి, ప్రతి ఒక్క గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఎఎన్ఎం, ఆశావర్కర్లు బిపి, షుగర్, రక్త పరీక్షల లక్ష్యం నియమించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో, సచివాలయం ఎం.అరుణ కుమారి, సూపర్‌బైజర్ వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

ఎంఎం రెస్టారెంట్ ప్రారంభం

కడప : కడప నగరంలోని స్థానిక వినాయక నగర్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఎంఎం రెస్టారెంట్‌ను గురువారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, కమలాపురం యువత నాయకులు ఇస్మాయిల్, పెట్రోల్ బంక్ రామ్మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు

కడప : సంక్రాంతి సందర్భంగా సిసి బస్ ట్రావెల్స్ వారు ఆర్టీసీ నిర్ణయించిన ప్రకారమే ప్రయాణికుల నుంచి ట్రావెల్ ఛార్జీలు వసూలు చేయాలని, ఎవరైనా అధిక చార్జీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఉప రవాణా కమిషనర్ ఇ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం డిటిసి కార్యాలయంలో సిసి బస్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధిక చార్జీలను వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఇప్పటివరకు 19 కేసులు నమోదు చేసి వారికి జరిమాన విధించామన్నారు. సిసి బస్సుల ఆపరేటర్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని తెలిస్తే సెల్ నెం. 9154294226కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

రక్తహీనతపై దృష్టి సారించాలి

కడప : సుస్థిర సమగ్రాభివృద్ధి లక్ష్య సాధనతో పాటు అనీమియా (రక్త హీనత) పై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సచివాలయం నుంచి ఆరోగ్యం, స్త్రీ, శిశుసంక్షేమమం, సుస్థిర సమగ్రాభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జెసి సాయికాంత్ వర్మ, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆరోగ్యం, సూక్ష్మ నీటిపారుదల, పరిశ్రమలు, మానవ వనరుల అభివృద్ధి, పేదరిక నిర్మూలన, మౌలిక సదుపాయాల కల్పన తదితర కీలక అంశాల్లో సుస్థిరమైన, సమగ్రమైన అభివృద్ధి సాధించాలన్నారు. మనబడి నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాలలోనూ కనీస, మౌలిక సదుపాయాలు కచ్చితంగా ఉండాలని సూచించారు. సిఎం విసి ముగిసిన అనంతరం కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ జిల్లాలో మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి శాఖను మరింత పటిష్ఠం చేస్తూ అంగన్వాడీ కేంద్రాలను చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార పంపిణీలో కీలకంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో అన్ని ప్రాధాన్యత రంగ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మోడల్ పరీక్షలు సద్వినియోగం చేసుకోండి

బద్వేలు :డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించబోయే కానిస్టేబుల్ మోడల్ పరీక్షలను సదస్వినియోగం చేసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పేర్కొన్నారు. గురువారం ఉదయం బద్వేల్ డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నాగభూషణం డిగ్రీ కళాశాలలో మోడల్ పరీక్షలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా పోలీస్‌శాఖలో నోటిఫికేషన్ లేనందున వయోపరిమితి ఐదు సంవత్సరాలకు పెంచాలని డివైఎఫ్ఐ యువజన సంఘం పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహించడంతో రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలకు వయోపరిమితి పెంచిందని తెలిపారు. ఈనెల 22న ప్రిలిమ్స్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు ఈ మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. జిల్లాలో కడప, బద్వేల్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పోరుమామిళ్ల ప్రాంతాలలో నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు 9912758515, 6302307192, 9502494474, 9912921048,8008057247లలో సంప్రదించాలని చెప్పారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

కడప : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ జన్మదినం సందర్భంగా కడప నగరంలోని స్నేహాలయ నిరాశ్రయ వసతి గృహం నందు కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి లు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామలాదేవి, నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య, ప్రవళిక, తిరుమలేష్, ప్రసాద్ గౌడ్, శ్రీకాంత్, ప్రసన్న, సత్యం, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని వృథా చేయడం తగదు



హజ్ హౌస్‌ను పరిశీలిస్తున్న సలావుద్దీన్

కడప అర్బన్ : పాలక ప్రభుత్వాలే కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తే ఎలా అని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ సూటిగా ప్రశ్నించారు. గురువారం నగర శివార్లలో నిరుపయోగంగా మారిన హజ్ హౌస్‌ను ప్రజాసంఘాల నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక హజ్ యాత్రకు వెళ్లే మైనార్టీ వర్గాల కోసం నిర్మించిన భవనం నేటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం దారుణమన్నారు. టీడీపీ హయాంలో నిర్మించారనే భావనతోనే వైసీపీ ప్రభుత్వం హజ్ హౌస్‌ను పట్టించుకోక పోవడానికి ప్రధాన కారణమని ఆరోపించారు. అభివృద్ధిని ఆకాంక్షించే పాలక ప్రభుత్వాలు ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. హజ్ హౌస్‌ను పట్టించుకోని కారణంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందని మండిపడ్డారు. భవనాన్ని మూసి వేయడం వల్ల అందులోని పరికరాలు పనికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముళ్ళపొదల మాటున భవనం ఉండటం బాధాకరమన్నారు. ఒకరిపై ఒకరు ద్వేషంతో ప్రజా ధనాన్ని వృథా చేస్తే పాలక ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

కల్యాణోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని చియ్యపాడు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం నిర్వహిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని స్థానికులు ఆహ్వానించారు. ఆ మేరకు వారు గురువారం ఆహ్వా నపత్రాన్ని అందజేశారు. ధర్మకర్త మండలి చైర్మన్ మహానందిగారి నిరం జన్‌రెడ్డి, కాత్యాయని కన్స్ట్రక్షన్ ఎండీ పివి రమణారెడ్డి, సర్పంచ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను కలిశారు. వారితోపాటు జయరామిరెడ్డి, వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గ్రామస్తులు

కల్యాణోత్సవానికి ప్రముఖులు

చియ్యపాడు జనమేజయ మహారాజుచే ప్రతిష్ఠించబడిన పురాతన దేవాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 15న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు తిరుపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పాల్గొంటారని ధర్మకర్త మండలి చైర్మన్ మహానందిగారి నిరంజన్‌రెడ్డి తెలిపారు. కనుమ పండుగ సందర్భంగా సోమవారం పార్వేట, కోలాటం నిర్వహిస్తున్నామన్నారు. బసిరెడ్డిపల్లె, రేపల్లె, సిద్ధారెడ్డిపల్లె, సోమాపురం, నెర్రవాడ, గుంత చియ్యపాడులో గ్రామోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. కల్యాణానంతరం కాత్యాయని కన్స్ట్రక్షన్ ఎండి పెద్దిరెడ్డి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీ చేస్తారని తెలిపారు.

14న కబడ్డీ పోటీలు

చియ్యపాడులో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 14 శనివారం కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.15వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడవ బహుమతి రూ.7వేలు, 4వ బహుమతి రూ.5వేలు, 5వ బహుమతి రూ.3వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల టీం సభ్యులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

తిరుమలను దోపిడీ కేంద్రంగా మార్చిన పాలకులు

ప్రజాశక్తి - మైదుకూరు

పవిత్ర తిరుమల క్షేత్రాన్ని జగన్‌రెడ్డి దోపిడీ కేంద్రంగా మార్చారని, భక్తుల్ని వేధిస్తున్నారని టిటిడి మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. గురువారం జూమ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించే కానుకలు, ఆస్తులు లెక్కల్లో చూపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె గదుల బాడుగలను విపరీతంగా పెంచుతారా అని ప్రశ్నించారు. ఉచితంగా లభించాల్సిన స్వామివారి దర్శనాన్ని ధనార్జనగా మార్చారని, హిందూధర్మం తెలియని వ్యక్తి చైర్మన్ కావడమే భక్తులకు శాపంగా మారిందన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల పుణ్యక్షేత్రాన్ని కూడా జగన్‌రెడ్డి తన దోపిడీకి నెలవుగా చేసుకున్నారని ఆరోపించారు. తనపరివారంతో భక్తుల్ని నిలువునా దోచుకుంటున్నారని విమర్శించారు. గతంలో అధికారులు, టిటిడి సిబ్బంది యాత్రికులకు ఇబ్బంది లేకుండా దర్శన ఏర్పాట్లు చేసేవారని, జగన్‌రెడ్డి అధికారంలో వచ్చాక స్వామి దర్శనం భక్తులకు దుర్లభమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

నాగబాబు వ్యాఖ్యలు అర్థరహితం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జిఒ నంబర్ వన్, సిఎం జగన్ గురించి నాగబాబు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కౌన్సిలర్ మూలి మహేశ్వర్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ జిఒ నంబర్ వన్‌లో ఏముందో తెలుసుకుని నాగబాబు మాట్లాడితే హుందాగా ఉంటుందన్నారు. అందులో ఏముందో తెలియకుండా ఇష్టానుసారంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. ప్రజా పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం తెచ్చిన జిఒ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, రహదారులపె కాకుండా బయట సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలని ఉందన్నారు.

'వేరుకుళ్లు' నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

బత్తాయి, మినుము పంటలో వేరు కుళ్ళ తెగులు, రసం పీల్చుపురుగు నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని కొలవలి గ్రామంలో గురువారం బత్తాయి, మినుము పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎఒ మాట్లాడుతూ రైతులకు తగు సూచనలిచ్చారు. కొత్తపల్లె సర్పంచు అరుణమ్మ అధ్యక్షతన రబీలో సాగు చేసిన శనగ పంటలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. .

తాగునీటి సమస్య పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తొలగించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మిగాయత్రి పేర్కొన్నారు. మండలంలోని గిడ్డంగివారిపల్లె పంచాయతీ పరిధిలోని ఆశోక్‌నగర్‌లో రూ.8 లక్షలతో నిర్మించిన ఆర్‌ఒ వాటర్ ప్లాంట్‌ను గురువారం వారు ప్రారంభించారు. అలాగే ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న చక్కిలు, కోడిగుడ్లపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆశోక్ నగర్‌లో ఉన్న సమస్యలను పరిష్కారించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో గిడ్డంగివారిపల్లె సర్పంచు ఓబుల్‌రెడ్డి, ఎంపిటిసిలు, రుద్రశివశంకర్ రెడ్డి, జరపాల వరలమ్మ, బక్కన్నగారిపల్లె సర్పంచు మల్లయ్య, మాజీ సర్పంచు ప్రసాద్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ప్రింటింగ్ నిషేధించడం అన్యాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రభుత్వం ఫ్లెక్సీ ప్రింటింగ్‌పై నిషేధం విధించడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీను పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 2 వేలకు పైగా ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపులు ఉన్నాయన్నారు. ఈనెల 26 నుండి రాష్ట్ర ప్రభుత్వం ఫ్లెక్సీ ప్రింటింగ్‌పై నిషేధం విధించడంతో షాపులు మూతపడి తాము రోడ్డున పడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం 100 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తులను మాత్రమే నిషేధించాలన్నారు. 250 మైక్రాన్ల ఏకో ఫ్లెక్సీ ఆరు నెలల్లో మట్టిలో కరిగిపోతుందన్నారు. కార్యక్రమంలో ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్ కమిటీ సభ్యులు సృజన శ్రీను, రామ్మోహన్‌రెడ్డి, శివానందరెడ్డి, రమేష్‌రెడ్డి, తేజ, బాబు, మల్లికార్జున, ఆనంద్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ప్రభుత్వం వెంటనే ఫ్లెక్సీల నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని సృజనా గ్రాఫిక్స్ శ్రీను, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక వివేకానంద జూనియర్ కాలేజిలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు నిషేధాన్ని అమలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎల్‌వి శ్రీను, కిరణ్, రమణ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయానికి తాళం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 6వ సచివాలయ సిబ్బంది సమావేశం ఉందని సచివాలయానికి తాళం వేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ సచివాలయ సిబ్బందికి, వార్డు కౌన్సిలర్లకు నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. వార్డ్ కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చేయడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం. కానీ సచివాలయానికి తాళాలు వేయడం వలన అక్కడికి ప్రజలు తమ పనులు నిమిత్తం వచ్చిన వారు ఇబ్బందులకు గురికాక తప్పలేదు. ఈ సచివాలయం పరిధిలో 10,11,12,13 కౌన్సిల్ వార్డులున్నాయి. వచ్చిన ప్రజలకు సమాధానం చెప్పడం కోసం కనీసం ఒక్కరైనా కార్యాలయంలో ఉండాలి కదా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్‌ను వివరణ కోరగా.. సచివాలయంలో సమావేశం ఏర్పాటు చేసుకొనుటకు తగినంత స్థలం లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేయవలసివచ్చిందని పేర్కొన్నారు

ప్రతి ఎకరాకూ నీరందిస్తాం : ఎంపీ



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ముద్దనూరు

వామికొండ రిజర్వాయర్ నుండి పైపులైన్ ఏర్పాటు చేసి చుట్టూ పక్కల ఉన్న చెరువులను నీటితో నింపి, ప్రతి ఎకరాకు నీరు అందిస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామాల్లో ఉన్న పెద్ద చెరువును గురువారం ఎంపీ, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం చెరువు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు మాట్లాడుతూ పొలాలకు నీరు అందించేందుకు వామికొండ రిజర్వాయర్ వద్ద ఎత్తి పోతల పథకం ఏర్పాటు చేయాలన్నారు. అక్కడి నుండి పైపులైన్ ద్వారా వేల్పుచెర్ల సమీపంలో ఉన్న కానలోని పూల చెరువుకు నీరు అందించాలన్నారు. ఇక్కడి నుంచి కాలువల ద్వారా వేల్పుచెర్ల, పెనికలపాడు, చిన్నకత్తెరపల్లె, ఉప్పలూరు, ఆకుతోటపల్లె, కొలవలి చెరువులకు నీరు అందుతుందని వారు వివరించారు. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,750 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందన్నారు. వీటితోపాటు తొండూరు మండలంలోని గంగనపల్లె, పోతలపల్లెలో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పైపులైన్ ఏర్పాటుకు రూ.11 కోట్ల 96 లక్షలతో ఇరిగేషన్ అధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతి పాదనలు అందజేసినట్లు తెలిపారు. ఫిబ్రవరిలో టెండర్లు పూర్తి చేసి వచ్చే మార్చి నాటికి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. వ్యవసాయ రంగానికి, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎంపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఎంపిపి-1 వీర రేణుక, మాజీ ఎంపిటిసి వరదారెడ్డి, వైసిపి నాయకులు డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, మండల యూత్ అధ్యక్షులు సుమంత్, సింగిల్ విండో డైరెక్టర్ శివారెడ్డి, వైసిపి నాయకులు వీరప్రతాప్, సర్పంచు జయరాం నాయుడు, డిప్యూటీ తహశీల్దార్ సుధీర్, ఇరిగేషన్ ఎస్ఇ మల్లిఖార్జునరెడ్డి, ఇఇ బాలచంద్రారెడ్డి, డిఇ వెంకట రాజ్‌కుమార్, ఎఇ చంద్రకిరణ్ పాల్గొన్నారు.

రైళ్లు నిలబడేలా చర్యలు తీసుకోవాలని వినతి

గతంలో ముద్దనూరు రైల్వేస్టేషన్లో నిలుస్తున్న రైళ్లను ప్రస్తుతం ఆగేలా చర్యలు తీసుకోవాలని గురువారం మండల యూత్ అధ్యక్షులు సుమంత్ యాదవ్, ప్రజలు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పులివెందుల, ముద్దనూరు, జమ్మలమడుగు ప్రాంతాల ప్రజలు ముద్దనూరు మీదుగా చెన్నై, ముంబై, కన్యాకుమారి వంటి దూర ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారని సుమంత్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. కరోనా ముందు చెన్నై ఎక్స్‌ప్రెస్, ముంబై మెయిల్, ఎగ్మోర్, హరిప్రియ రైళ్లు నిలబడేవన్నారు. రైళ్ల కోసం ఎర్రగుంట్లకు వెళ్లాల్సి వస్తోందని, వృద్ధులు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో నిలబడే రైళ్లతోపాటు ధర్మవరం, విజయవాడ రైలు, కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నిలబడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఎంపీ స్పందిస్తూ రైల్వే మంత్రి, రైల్వే శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువత క్రీడా రంగంలో రాణించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

యువత క్రీడారంగంలో రాణించాలని డివైఎఫ్ఐ మాజీ నాయకులు వీరనాల శివనారాయణ పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జమ్మలమడుగులో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో యూత్‌కు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా డివైఎఫ్ఐ మాజీ నాయకులు వీరనాల శివనారాయణ టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో నేటి తరం ఆటల కంటే మొబైల్స్‌లో ఎక్కువ సమయం కేటాయిస్తూ క్రీడలకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్తేజాన్నిస్తాయన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏడాది సంక్రాంతి పండగ పురస్కరించుకొని యువతకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతోందన్నారు. విజేతలకు ప్రముఖులచే బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మన్సూర్, కమాల్‌బాషా, ఇమామ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



టాస్ వేసి క్రికెట్‌ను ప్రారంభిస్తున్న శివనారాయణ

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి



ఆర్ట్స్ కాలేజీలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్



కెఎస్ఆర్ఎంలో..

యువత సక్రమ మార్గంలో నడవాలి : జడ్జి

కడప / కడప అర్బన్ : యువత సక్రమ మార్గంలో నడవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్ కవిత అన్నారు. గురువారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటిఐ లో జాతీయ యువ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నేటి యువత మద్యం మత్తుకు బానిస కాకుండా సక్రమమైన మార్గంలో అనుకున్న లక్ష్యాలను సాధించాలని అన్నారు. కార్యక్రమంలో స్టెప్ సిఒఒ సాయి గ్రేస్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ ఎన్. వై. కె. మణికంఠ, విజేత మహిళా మండల అధ్యక్షులు అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆర్ట్స్ కళాశాలలో..** యువతలో చైతన్యం వచ్చినప్పుడే సమాజానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. గురువారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జాతీయ యువ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వివేకానందుని జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ శివ రామ కృష్ణ, డాక్టర్ వై. సావిత్రి, ఏ.నాగరాజు బోధన బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. **కెఎస్ఆర్ఎం కళాశాలలో..** యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎమ్‌డి కందుల చంద్రఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో స్వామి వివేకానంద160 వ జయంతిని కళాశాల సభా సమావేశం మందిరంలో నిర్వహించారు. ముఖ్యఅతిథి పుల్లయ్య కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ కర్నూల్ ఫౌండర్ పుల్లయ్య హాజరయ్యారు. ఫ్రెండ్స్ అసోసియేషన్ కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బ్రాంచీలవారీగా ప్రశంసా పత్రాలను, నగదు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, బాల వికాస్ హై స్కూల్ కరెస్పాండెంట్ గంగయ్య, కె.ధరణి కుమార్, కళాశాల స్టూడెంట్ యాక్టివిటీ సమన్వయకర్త లీనా రాస్తాపూర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..** వినాయక నగర్ కూడలిలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి ఆయన జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు డాక్టర్ రంగనాథరెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌జెయుపి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు ,లయన్స్ క్లబ్ కార్యదర్శి గౌరీశంకర్, క్లబ్ ప్రతినిధులు కొండారెడ్డి, పవన్ కుమార్, జ్ఞానేశ్వర్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు పాల్గొన్నారు. **అల్‌షిఫా కేంద్రంలో** పాత రిమ్స్‌లో ఉన్న అల్ షిఫా కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రఫీ, ప్రిన్సిపల్ ప్రత్యేక ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** పట్టణంలోని స్వామి వివేకానంద చైతన్య సమితి ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం ను స్వామి వివేకానంద 160వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డి సి గోవింద రెడ్డి హాజరయాయరు. మొదట వివేకానంద విగ్రహానికి పూలమాల నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షులు అడపా మధుసూదన్ రావు, వ్యవస్థాపక అధ్యక్షులు కల్లూరు రామకృష్ణారెడ్డి, పంగా గురువిరెడ్డి , డాక్టర్ మార్కా రెడ్డి, ఆర్మీ తిరుపతయ్య, కుర్రా చెన్న కృష్ణయ్య నాగేంద్ర, ఐఏఎస్ జయరాం రెడ్డి, పోకల సుబ్బారెడ్డి, పుల్లయ్య, సెట్టెం చెన్నయ్య,గురుమూర్తి, దేశాయి సుమంత్ రెడ్డి, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.**వేంపల్లె :** స్వామి వివేకానందుడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఐ తిరుపాల్ నాయక్ సూచించారు. స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ యువజన దినోత్సవ వేడుకలు నిర్వ హించారు. ఈ సందర్భంగా కళాశాల అవరణంలో స్వామి వివేకానంద చిత్ర పటానికి ఎస్ఐ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజినేయులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ఎఎస్ఐ అన్వర్ బాషా, అధ్యాపకులు రాజారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు. జగన్ ప్రభుత్వం యవశక్తిని నిర్వీర్యం చేస్తోందని పిసిసి మీడియా చైర్మన్ నర్రెడ్డి డాక్టర్ తులసిరెడ్డి తెలిపారు. వేంపల్లెలో స్వామి వివేకానంద జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు సత్తార్, చార్లెస్, రామకృష్ణ, ధ్రువకుమార్‌రెడ్డి, చెన్నకేశవ, నరసింహారెడ్డి, ఉత్తన్న, బద్రి, రాఘవయ్య, వెంకటేశు పాల్గొన్నారు. **ముద్దనూరు :** స్థానిక వైసిపి కార్యాలయంలో యువ తకు స్ఫూర్తి ప్రదాత, భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహ నీయుడు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సింగిల్ విండో డైరెక్టర్ శివారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సునీల్‌కుమార్, మునెయ్య, శ్రీనివాసులు, కిరణ్, బ్రమ్మయ్య, పెద్దన్న, వాసు, పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజాధనం వృథా : టిడిపి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈ మూడున్నరేళ్లలో ఒక్కరికి కూడా సంక్రాంతి కానుక ఇవ్వని జగన్‌రెడ్డి ప్రభుత్వ భవనాలకు వైసిపి రంగులు వేయడానికి రూ.3,500 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెరిగిన అన్ని రకాల ధరలతో పేదలకు సంక్రాంతి ఆనందం దూరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానుక పేరుతో రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. తమ ప్రభుత్వంలో బియ్యం బదులుగా రాగులు, జొన్నలు, గోధుమలు ఇచ్చామన్నారు. ప్రస్తుతం అలాంటివి ఏవి లేకుండా చేసి పౌర సరఫరా వ్యవస్థను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కరోనా నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన బియ్యాన్ని పంపిణీ చేయకుండా ఇతర దేశాలకు తరలించారన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, సీతారామిరెడ్డి, సిద్దయ్య, గురప్ప పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకు రాష్ట్రం అధోగతి : ప్రవీణ్

జగన్‌కు ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకు రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు శ్రీనివాసనగర్‌లో గురువారం పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులతో కలిసి ఇదేం ఖర్మ రాష్ట్రనికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి మహిళలు ఘనస్వాగతం పలికారు. జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఈవి సుధాకర్‌రెడ్డి, ముక్తియార్, టప్ప మహబూబ్ బాషా, గోలే పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో నష్టపోతున్న యువత : నాగరాజు

జగన్ ప్రభుత్వ విధానాలతో తీవ్రంగా నష్టపోతున్న యువతకు ప్రశ్నించే వేదిక కల్పించేందుకు లోకేష్ పాదయాత్ర చేస్తున్నట్లు రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నాగరాజు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం యువగళం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ యువగళం పాదయాత్ర కుప్పం నుంచి ప్రారంభమవుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా యువత ఈ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రొద్దుటూరు నుండి 100 మంది తెలుగు యువత యువకులు పాదయాత్ర మొదటి రోజు నుండి చివరి రోజు వరకు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పుత్తా యల్లారెడ్డి, నాయకులు యమ్మనూరు ఆంజనేయులు, రాజేష్, సాయిరాం, షరీఫ్ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న లింగారెడ్డి

వైసిపిలో వైరాగ్యం : భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : తెలుగుదేశం పార్టీ ఆదరణకు వైసిపిలో వైరాగ్యం నెలకొందని టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మునిసిపాలిటీ లోని 7వ వార్డు (ఎస్‌కాలనీ)లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా తెలుగుదేశం పార్టీలోకి 10 కుటుంబాలను కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కుమార్, పుల్లయ్య, ఓబులేసు, త్యాగరాజు, విజయ్, యోహాన్, శేఖర్ ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, రాజశేఖర్, లోకేష్, ముద్దనూరు హరి, పుల్లయ్య, విజయ్, త్యాగరాజు, కుమార్, నెల్సన్ కుమార్, ఓబులేసు, ఫిలిప్, జయచంద్ర, మోహన్, ఖదీర్, రఫీ, ఎంఎం బాషా, పాపోడు, చిన్నబాబు, లక్ష్మయ్య, బాబు, నరసింహులు, కళ్యాణ్, శేఖర్, నవీన్, పెద్దయ్య, తులసికాంత్, శశి, వినోద్, రాంబాబు, గణేష్, నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

18న కానిస్టేబుల్ నమూనా పరీక్ష : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా నమూనా కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, దాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని త్రీటౌన్ సిఐ నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. ఆ మేరకు పరీక్ష కరపత్రాన్ని గురు వారం సిఐ నారాయణ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఇలాంటి ప్రతిభ, నమూనా పరీక్షలు అభ్యర్థులకు చాలా ఉపయోగకరమన్నారు. డివైఎఫ్ఐకి అభినందనలు తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ నమూనా పరీక్షలు పోటీ పరీక్షల నిపుణులు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష రుసుం రూ.100 చెల్లించాలన్నారు. లన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుందన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగే నమూనా పరీక్షలు జిల్లా వ్యాప్తంగా కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేల్, పోరుమామిళ్ల ప్రాంతాల్లో నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు 99127 58515, 95024 94474 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపా ధ్యక్షులు డేవిడ్‌రాజ్ ప్రొద్దుటూరు నాయకులు వెంకటేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

వైద్య సేవలపై ఆరా

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎస్.ఖాదర్‌వలి ఆరా తీశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఎస్.ఖాదర్‌వలి వైద్యాధికారి డాక్టర్ ఎస్.ముబీన్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిని పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం అన్ని జాతీయ కార్యక్రమాలపై డాక్టర్‌ను, సూపర్‌వైజర్స్‌ను అడిగిన తెలుసుకున్నారు, అన్ని జాతీయ కార్యక్రమాలను అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజియోథెరఫిస్ట్ విక్టర్ మనోహర్, మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, సూపర్‌వైజర్ సునీల్‌కుమార్, ఫార్మసిస్ట్ కేశవయ్య, సీనియర్ అసిస్టెంట్ ప్రశాంతి, ల్యాబ్ టెక్నీషియన్ దుర్గాప్రసాద్, స్టాఫ్‌నర్స్ పాల్గొన్నారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణ సమీపంలోని శిల్పారామంలో ఈనెల 14 నుండి 16వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన శిల్పారామంలో విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి మూడు రోజులపాటు పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమాలను పులివెందుల నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా సంబరాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఒ వెంకటసుబ్బయ్య, ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్ సాహెబ్, జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, డిఇఒ రామకృష్ణ, శివానందరెడ్డి, మునికిషోర్, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందులలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న వైయస్ రాజశేఖర్‌రెడ్డి క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సిఇఒ వెంకటశివారెడ్డి సూచించారు. స్టేడియాన్ని గురువారం ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనులపై కాంట్రాక్టర్‌కు సూచించారు. పులివెందుల క్రీడాకారుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి క్రికెట్ స్టేడియాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రపంచంలోనే క్రికెట్‌కు అత్యంత ఆదరణ లభిస్తోందన్నారు. ఇప్పటికే గ్రౌండ్ నిర్మాణం పూర్తయిందని పచ్చిక పనులను చేపట్టామన్నారు. అనంతరం ఆయన అధికారులకు తగిన సూచనలిచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ వీరభద్రరెడ్డి, జిల్లా అసోసియేషన్ అధికారులు పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతికి ప్రతిబింబాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పండుగలు మన సంస్కృతికి ప్రతిబింబాలని అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ చిన్మయ మిషన్ ప్రొద్దుటూరు శాఖ నిర్వాహకురాలు బ్రహ్మచారిణి రచనా చైతన్యమాతాజీ, అధ్యక్షుడు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కల్యాణ మండపంలో గురువారం సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పోటీల్లో భాగంగా గురువారం కోలాటం, గొబ్బి నృత్యం పోటీలు నిర్వహించామని తెలిపారు. శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. శని, ఆదివారాల్లో చిన్మయ మిషన్ కేంద్రంలో భోగిమంటలు, పూజాకార్యక్రమాలు ఉంటాయన్నారు. గురువారం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.5000, రెండవ బహుమతిగా రూ.3,000, మూడవ బహుమతిగా రూ.2,000 ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి ప్రమాదాలను అరికట్టాలని ట్రాఫిక్ సిఐ యుగంధర్ తెలిపారు. యువజన దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (యంపిజె) కార్యాలయంలో 'ట్రాఫిక్ రూల్స్‌ను పాటించండి-ప్రమాదాలను అరికట్టండి' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించని పక్షంలో జరిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. యంపిజె రాష్ట్ర సహాయ కార్యదర్శి సలీం మాట్లాడుతూ వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జాకీర్, పట్టణ అధ్యక్షులు హుశేన్‌బాషా, ఉపాధ్యక్షులు నజీర్, కార్యదర్శి అస్లం, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

కాలువలో వ్యర్థాలు, పూడిక తొలగింపు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మున్సిపల్ అధికారులు పట్టణంలోని కాలువల్లో నిలువ ఉన్న వ్యర్థాలు, పూడికలను తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు రోడ్డు, ఎత్తపువారి కాలనీ లో పూడికలను తొలగించారు. ముద్దనూరు రోడ్డులో ఉన్న డివైడర్ల మధ్య ఉన్న వ్యర్థాలను, మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా నూర్‌బాషా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు వ్యర్థాలను రోడ్లపై వేయరాదన్నారు. ఇళ్ల వద్దకు వచ్చే కార్మికులకు అందజేయాలని సూచించారు. కాలువల్లో చెత్త వేయడం వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

- అనాథ అయిన మూడేళ్ల బాలుడు

ప్రజాశక్తి - ముద్దనూరు

నిద్రలో చనిపోయిన తండ్రి నిద్ర పోతున్నాడనుకుని పక్కలో పడుకున్న మూడేళ్ల బాలుడు తండ్రిపై పడుకుని ఆడుకుంటున్న ఘటన స్థానికులను కంట తడి పెట్టించింది. జమ్మల మడుగు రహదారిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న గంగమ్మ దేవాలయం వద్ద గురు వారం గుర్తు తెలియని 35ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు.. మృతుడు 2నెలల కిందట ముద్దనూరు వచ్చాడన్నారు. ఇతనికి 3ఏళ్ల బాలుడు ఉన్నాడన్నారు. భిక్షాటన చేసుకుంటూ ఉండేవాడు. రాత్రుల్లో ఏదో ఒక చోట పడుకునేవాడు. ఇతను అస్మాతో బాధపడుతుండేవాడని స్థానికులు తెలిపారన్నారు. బుధవారం రాత్రి గంగమ్మ గుడి వద్ద ఆరు బయట నిద్రపోయాడు. గురువారం తెల్లవారినా నిద్రలో నుండి లేవకపోవడంతో మృతి చెందాడని స్థానికులు సమాచారం అందించారన్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ముద్దనూరు మేజర్ పంచాయతీ సర్పంచు కుమారుడు ప్రశాంత్ పంచాయతీ సిబ్బందితో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. బాలుడ్ని ఐసిడిఎస్ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. కడప శిశు గృహంలో అప్పగించనున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ ముంతాజ్ బేగం తెలిపారు.



మృతి చెందిన తండ్రి వద్ద ఉన్న బాలుడు